# సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 25 । జూన్ । 2023




## మొబైల్ కథాంశంతో..

మాయా పేటిక చిత్ర యూనిట్ శనివారం విశాఖలో సందడి చేసింది. చిత్రాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

8లో



## నురగ కక్కుతున్న తీరం

8లో

భీమిలి నుంచి రుషికొండ బీచ్ వరకు గోధుమ వర్ణంలో నురుగలు కనిపించడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.



## నకిలీ పత్రాల ముఠా అరెస్ట్

నకిలీ ధ్రువపత్రాలు తయారు చేసే ముఠాను మహారాణిపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

8లో



## న్యూస్‌రీల్

### రూ.1.60 కోట్ల ఆస్తిపన్ను చెల్లించిన ఏపీఐఐసీ



గాజువాక జెడ్సీ సింహాచలంకు చెక్కును అందజేస్తున్న ఆర్వో శ్రీకాంత్, ఆర్ఐలు

**గాజువాక:** గాజువాక ఆటోనగర్‌కు సంబంధించిన ఆస్తి పన్నును ఏపీఐఐసీ, ఐలా శనివారం చెల్లించాయి. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది మార్చి వరకు చెల్లించాల్సిన రూ.1,60,48,108 మొత్తానికి సంబంధించిన చెక్కును ఏపీఐఐసీ జోనల్ కమిషనర్ కె.సూర్యనారాయణ జీవీఎంసీ గాజువాక రెవెన్యూ అధికారి శ్రీకాంత్, ఆర్ఐలు శివ, సుభాన్, మోహన్‌లకు అందజేశారు. ఆ చెక్కును వారు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు.

### 21 ట్రావెల్ బస్సులపై కేసులు



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

**గోపాలపట్నం:** ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు రెండు రోజు శనివారం కొనసాగాయి. నిబంధనలు పాటించని 21 బస్సులపై కేసులు నమోదు చేయడంతో పాటు ఒక బస్సు సీజ్ చేశామని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు బుచ్చిరాజు, హరి ప్రసాద్ మన్మోహన్, శ్రీనివాస్ యాదవ్, సత్యం నాయుడు, లలిత తనిఖీల్లో పాల్గొన్నారు.

### నేడు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రాక

**మహారాణిపేట:** రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఆదివారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఆయన బయలుదేరి ఉదయం 5.35 గంటలకు విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వెళతారు. అక్కడ విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళ్తారు.

### నేడు ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని రాక

**మహారాణిపేట:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని ఆదివారం రాత్రి 7గంటలకు విశాఖ చేరుకుంటారు. రాత్రి ఇక్కడే బస చేస్తారు. 26న ఉదయం 7.30 గంటలకు పాడేరు వెళ్లి అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం బయలుదేరి విశాఖ చేరుకుంటారు.

### 27న జాబ్‌మేళా

**సీతంపేట:** ఎన్ఐఐటీ ఫౌండేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈ నెల 27న లంకపల్లి బుల్లయ్య కళాశాలలో జాబ్‌మేళా జరగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 14 సంస్థలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయి. ఐటీ రంగానికి సంబంధించిన సంస్థలు బ్లాక్ 7 ఇంజినీరింగ్ కళాశాలలో, నాన్ ఐటీకి సంబంధించిన సంస్థలు బ్లాక్ 9 డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి.

### పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఏయూక్యాంపస్:** యూజీసీ నెట్, సీఎస్ఐఆర్ నెట్, గేట్, సీఈఈడీ వంటి జాతీయస్థాయి అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారి నుంచి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. ఈ నెల 26 నుంచి ప్రవేశాల సంచాలకుల వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని.. జూలై 7లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు. జూలై 10న పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. http://www.audoa.in/ ను సందర్శించాలని సూచించారు.

# ప్రతి లబ్ధిదారుడికీ సురక్ష

- ప్రతి కుటుంబాన్ని పలకరించి వివరాలు సేకరించండి
- జిల్లా ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు సూచన
- జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష



మాట్లాడుతున్న సీడీఎంఏ కోటేశ్వరరావు, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సాయికాంత్ వర్మ

**సాక్షి, విశాఖపట్నం:** వలంటీర్ నుంచి ఉన్నతాధికారి వరకు సమన్వయంతో పనిచేసి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి, కమిషనర్ అండ్ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్, మండల అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంలో వచ్చే ప్రతి అర్జీని పెండింగ్ లేకుండా 'జగనన్న సురక్ష'లో పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించాలని, ప్రజా సమస్యలకు సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్హులై ఉండి ఇంకా ఎక్కడైనా లబ్ధి పొందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావాల్సిన పత్రాలు సేకరించాలని సూచించారు. మండల స్పెషలాఫీసర్లు సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జూలై ఒకటి నుంచి జరిగే శిబిరాల వద్ద ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జూలై 1 నుంచి జిల్లాలోని 656 సచివాలయాల పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ పరిధిలో ఐదు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా శిబిరం నిర్వహిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతి సచివాలయంలోనూ శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణ పరిధిలో 607 సచివాలయాలకు గానూ 189 శిబిరాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పట్టణ ప్రాంతంలో 70, గ్రామీణ ప్రాంతంలో 8 బృందాలు పనిచేస్తాయన్నారు. డీఆర్వో శ్రీనివాస్ మూర్తి, ఆర్డీవో భాస్కర రెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, గ్రామ, వార్డు సచివాలయ జిల్లా ఇన్‌చార్జి పూర్ణిమా దేవి, జోనల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ వాడొద్దు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



**డాబాగార్డెన్స్:** వరాహ లక్ష్మీ నృసింహస్వామి గిరి ప్రదక్షిణలో నిషేధిత ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నందున.. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అందించే ప్రసాదాలు, తీర్థ పానీయాలను ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల్లో అందజేయాలన్నారు. జీవీఎంసీ దాదాపు 100 పాయింట్లలో తాగునీరు, పలుచోట్ల వైద్య శిబిరాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తుందన్నారు. భక్తులకు తెలిసే విధంగా నీలం రంగు కలిగిన బెలూన్ వద్ద తాగునీరు, ఆకుపచ్చ రంగు బెలూన్ వద్ద డస్ట్‌బిన్లు, ఎరుపు రంగు బెలూన్ వద్ద వైద్య శిబిరం అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా వారి చేతి మణికట్టుపై ట్యాగ్‌ను కట్టేలా 20 చోట్ల ఏర్పాట్లు చేస్తామన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ఆహార పదార్థాలను వాహనాల్లో తీసుకెళ్లేందుకు గతంలో పోలీసులు అనుమతి ఇవ్వలేదని తెలపగా.. కలెక్టర్ సూచన మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 32 కిలోమీటర్ల పరిధిలోని దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు దాడులు నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, భారత వికాస్ పరిషత్ కార్యదర్శి పి.భాస్కరరావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఏర్పాట్లు ఇలా..

- 100 పాయింట్లలో తాగునీరు
- 20 చోట్ల పిల్లలకు చేతి మణికట్టుపై ట్యాగ్‌ల ఏర్పాటు కేంద్రాలు
- బ్లూ కలర్ బెలూన్ వద్ద తాగునీరు సౌకర్యం
- గ్రీన్ కలర్ బెలూన్ వద్ద డస్ట్‌బిన్లు
- రెడ్ కలర్ బెలూన్ వద్ద వైద్య శిబిరం

# నృసింహావతారంలో జగన్నాథుడు

భక్తులతో కిక్కిరిసిన టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణం



సింహగిరి నుంచి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న వైదికులు, అధికారులు

**డాబాగార్డెన్స్/సింహాచలం:** టర్నర్ చౌల్ట్రీ వద్ద సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కొలువుదీరిన స్వామి శనివారం నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో టర్నర్ చౌల్ట్రీ ప్రాంతం కిక్కిరిసిపోయింది. వేకువజామున 5 గంటలకు మేల్కొలుపు అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు, లలిత, విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం అక్కినపల్లి రాధా ప్రసాదాచార్యుల ధార్మికోపన్యాసం ఆలోచింపజేసింది. శ్రీసాయి కళానికేతన్ నృత్య దర్శకురాలు ఎం. పద్మిణి రాగినిచే ఏర్పాటు చేసిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది. ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు పాల్గొన్నారు.



### స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికార, వైదికులకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం పట్టు వస్త్రాలతో అధికారులు, ఉద్యోగులు అప్పన్న ఆలయ బేడా ప్రదక్షిణ చేశారు. అనంతరం టర్నర్ చౌల్ట్రీకి వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ కె.శిరీష, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్లు పాలూరి నరసింగరావు, సునీల్, గాయత్రి, అర్చకుడు పెదరాజు తదితరులు పాల్గొన్నారు.

# అట్టుడికిన గంగవరం పోర్టు

- ఇద్దరు ఉద్యోగులను తొలగించడంతో ఉద్రిక్తత
- నిరసనలతో హోరెత్తించిన కార్మికులు



ఉద్యోగులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



గంగవరం పోర్టు వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

**పెదగంట్యాడ:** అదానీ గంగవరం పోర్టు ప్రాంతం శనివారం మళ్లీ అట్టుడికింది. ఇద్దరు ఉద్యోగులను తొలగించడంతో కార్మికులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. 2009లో పోర్టులో చేరిన ఉద్యోగులకు అప్పట్లో రూ.4,700 జీతాలు ఇవ్వగా.. అందులో బేసిక్ రూ.3,400. 14 ఏళ్ల అయినా బేసిక్‌లో మాత్రం మార్పు లేదని, జీతాలు రూ. 36వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ రెండు నెలల కిందట ఉద్యోగులు పెద్దఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోర్టు యాజమాన్య ప్రతినిధులతో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చర్చలు జరిపారు. ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే వారు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో పాటు ఇక్కడ పని చేస్తున్న నొల్లి స్వామి, సమ్మిడి పరమేశ్వరరావును తొలగించడంతో ఉద్యోగులు మరోసారి ఆందోళనకు దిగారు. పోర్టు లోపల, గేటు బయట నిరసనలు తెలిపి.. నినాదాలతో హోరెత్తించారు. ఈ సమాచారం అందుకున్న న్యూపోర్టు, దువ్వాడ, స్టీల్‌ప్లాంట్, నగరం నుంచి పెద్ద సంఖ్యలో పోలీసులను ఇక్కడ మోహరించారు. డీసీపీలు ఆనంద్‌రెడ్డి, నాగన్న పోర్టు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళన చేస్తున్న వారికి సర్దిచెప్పినా ఫలితం లేకపోవడంతో 144 సెక్షన్‌ను విధించారు. ఆందోళనకారులను చెదరగొట్టారు. గంటిపల్లి అమ్మోరు, కంటిముచ్చ సింహాద్రి, వీరన్న, తాతారావు, అమ్మోరు, ఎర్రయ్య, జయ, నూకరాజును అదుపులోకి తీసుకున్నారు. వీరిని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై సాయంత్రం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ తొలగించిన ఇద్దరు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎంతమందిని అరెస్ట్ చేసినా వెనక్కి తగ్గది లేదన్నారు. యాజమాన్యం దిగి వచ్చే వరకు ఎన్ని పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, కార్పొరేటర్లు దల్లి గోవింద్, గంగారామ్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొవిరి అప్పలరాజు తదితరులు పోర్టు వద్దకు చేరుకుని ఉద్యోగులతో మాట్లాడారు. యాజమాన్య ప్రతినిధులతో చర్చలకు సిద్ధమయ్యారు. అయితే యాజమాన్య ప్రతినిధుల నుంచి ఎలాంటి స్పందన లేకపోయింది. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి.. సోమవారం చర్చలు జరిపేందుకు కృషి చేస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు.



పోర్టు గేటు వద్ద మోహరించిన పోలీసులు

## శిష్టకరణ ఓబీసీ అంశం పార్లమెంట్‌లో చర్చకు వచ్చేలా కృషి



సుబ్బారెడ్డిని కలిసిన అనూష పట్నాయక్, ఎస్.ఎస్.కె.మహంతి తదితరులు

**బీచ్‌రోడ్డు:** శిష్టకరణ సామాజిక వర్గాన్ని ఓబీసీ జాబితాలో చేర్చే అంశంపై త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో చర్చకు వచ్చేలా తన వంతు కృషి చేస్తానని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. నగరానికి వచ్చిన ఆయన్ని శనివారం శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష శశిధర్ పట్నాయక్, శిష్టకరణ సంక్షేమ సంఘం సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌సీబీసీకి సిఫారసు చేసిందని గుర్తు చేశారు. ఈ అంశాన్ని పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి.. పార్లమెంట్‌లో చర్చకు వచ్చేలా తన వంతు ప్రయత్నం చేస్తానని వై.వి.సుబ్బారెడ్డి వారికి హామీ ఇచ్చారు. శిష్టకరణ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎస్.కె.మహంతి, ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జూలో పెద్ద పులి మృతి



పెద్ద పులి జానకి(ఫైల్)

**ఆరిలోవ:** జూ పార్కులో జానకి(22) అనే ఆడ పెద్ద పులి వృద్ధాప్యంతో శనివారం మృతి చెందింది. జూలో ఎన్‌క్లోజర్‌లో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరించే జానకి కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురైంది. జూ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించినా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. వృద్ధాప్య కారణంగా అనారోగ్యానికి గురై కొన్ని రోజులుగా ఆహారం కూడా తినలేదని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. ప్రస్తుతం జూలో మూడు పెద్ద పులులున్నట్లు పేర్కొన్నారు.

# పలు రైళ్ల రద్దు

**తాటిచెట్లపాలెం:** దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో భద్రతాపరమైన పనులు చేపడుతున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

విశాఖ – గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ సోమవారం నుంచి జూలై 2 వరకు, గుంటూరు – విశాఖ (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ జూన్ 27 నుంచి జూలై 3 వరకు, విశాఖ– విజయవాడ (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ సోమవారం నుంచి జూలై 2 వరకు, కాకినాడ – విశాఖ (17267/17268) ఎక్స్‌ప్రెస్ సోమవారం నుంచి జూలై 2 వరకు రాజమండ్రి – విశాఖ– (07466/07467) పాసింజర్ సోమవారం నుంచి జూలై 2 వరకు రద్దు చేశారు.

**పలు రైళ్లు దారి మళ్లింపు...**

జూన్ 27న హతియా – ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్, జూన్ 27, 30, జూలై 1న ధన్‌బాద్ – అలెప్పి (13351) బొకారో ఎక్స్‌ప్రెస్, జూన్ 30న టాటానగర్ – ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్, జూలై 1న హతియా – ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్‌లు నిడదవోలు – ఏలూరు – విజ యవాడ మీదుగా కాకుండా వయా నిడదవోలు – భీమవరం టౌన్ – గుడివాడ – విజ యవాడ మీదుగా నడుస్తాయి. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని కోరారు.

## 27న ఎన్ఏబీహెచ్ టీమ్ పర్యటన



మానసిక వైద్యశాల

**మురళీనగర్(విశాఖ ఉత్తర):** ప్రభుత్వ మానసిక వైద్యశాల కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరనుంది. అత్యున్నత ప్రమాణాలతో సేవలందించే కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులకు మాత్రమే వచ్చే నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ సంస్థ(ఎన్ఏబీహెచ్) ఈ వైద్యశాలను ఈ నెల 27 నుంచి రెండు రోజుల పాటు సందర్శించి అసెస్‌మెంట్ చేస్తుంది. ఆస్పత్రి పనితీరు, సేవలు, రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత వంటి అంశాలను బృంద సభ్యులు పరిశీలించి నివేదిక తయారు చేస్తారు. ఇందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నట్లు మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. ఎన్ఏబీహెచ్ సర్టిఫికెట్ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని వల్ల తమ ఆస్పత్రి రాష్ట్రంలోనే ఎన్ఏబీహెచ్ సర్టిఫికెట్ పొందిన మొట్టమొదటి ఆస్పత్రిగా గుర్తింపు పొందుతుందన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరవుతాయని, ఆస్పత్రి సేవలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.

# మొబైల్ కథాంశంతో మాయా పేటిక

- విశాఖలో చిత్ర యూనిట్ సందడి

**డాబాగార్డెన్స్:** జస్ట్ ఆర్డినరి బ్యానర్‌పై సునీల్, విరాజ్ అశ్విన్‌లు హీరోలుగా పాయల్ రాజ్‌పుత్(ఆర్‌ఎక్స్100) హీరోయిన్‌గా.. రమేష్ రాపర్తి దర్శకత్వంలో, నిర్మాతలు మాగుంట శరత్ చంద్రారెడ్డి, తారక్ బొమ్మిరెడ్డి రూపొందించిన మాయా పేటిక చిత్ర యూనిట్ శనివారం విశాఖలో సందడి చేసింది. నగరంలో ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్రంలో కీలకపాత్ర పోషించిన పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. సినిమా ప్రమోషన్ విశాఖ నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందని, మొబైల్ ఫోన్ కారణంగా ప్రతి మనిషి జీవన విధానం ఎలా మారిపోయిందన్నదే చిత్ర కథాంశంగా ఈ చిత్రం రూపొందిందని చెప్పారు. హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ మనిషి జీవితంలో ముఖ్య సాధనంగా మారిన ఫోన్ కథాంశంతో సినిమా తీశామన్నారు. మొబైల్ కారణంగా జీవితంలో ఎదురయ్యే సంఘటనలు విచిత్రంగా ఉంటాయని, అందులో నుంచే హాస్యం పండించే సన్నివేశాలు ఉంటాయన్నారు. తాను విశాఖ గీతంలో చదువుకున్నానని, విశాఖలో సినీ ప్రమోషన్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సంగీత దర్శకుడు గణేష్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ సినిమా చాలా విభిన్నంగా ఉంటుందని, ఈ నెల 30న చిత్రం విడుదల అవుతుందని చెప్పారు. నటి శ్యామల మాట్లాడుతూ తాను కం బ్యాక్‌గా సినిమాలు చేస్తున్నానని, ఈ చిత్రంలో హీరో సునీల్ భార్య పాత్రలో నటించానని తెలిపారు. సమావేశంలో చిత్ర నటి సిమ్రాత్ కౌర్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# నురగ కక్కుతున్న తీరం

- కాలుష్యమే కారణమంటున్న మత్స్యకారులు

**కొమ్మాది:** బీచ్ అంటే ఆహ్లాదకర వాతావరణం, చల్లని గాలి, అలల తాకిడితో కనువిందు చేసే ఓ ప్రదేశం. ప్రశాంతంగా కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు, కుటుంబంతో సరదాగా గడిపేందుకు అనువైన స్థలం. అందుకే ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులతో విసిగిపోయిన ప్రజలు సాయంత్రం అయ్యేసరికి అలసట తీరేందుకు తీరాన్ని ఆశ్రయిస్తారు. అయితే ఇప్పుడు ఆ తీరంలో వస్తున్న మార్పులతో పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వేకువజామున భీమిలి బీచ్ నుంచి రుషికొండ బీచ్ వరకు నీలి కాంతి అలలు అలజడి సృష్టిస్తే, ప్రస్తుతం బీచ్‌లో భారీ ఎత్తున గోదుమ వర్ణములో నురుగలు ఒక్కసారిగా తీరంలో కనిపించడంతో పర్యాటకులు, స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట నుంచి తిమ్మాపురం వరకు శనివారం సాయంత్రం ఒక్కసారిగా గోధుమ వర్ణములో అలల నుంచి నురుగలు పెద్ద ఎత్తున వచ్చాయి. తీరంలో ఉన్న పెద్దపెద్ద రాళ్లపై ఈ నురగ దర్శనమివ్వడంతో పర్యాటకులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. సముద్రంలో అలల తాకిడికి నురగ రావడం సాధారణమే అయినప్పటికీ రంగు మారి గోధుమ వర్ణములో పెద్ద ఎత్తున నురగ రావడం మొదటి సారిగా చూసినట్లు స్థానికులు అంటున్నారు. తీరం వెంబడి ఉన్న పలు రొయ్యి పిల్లల కేంద్రాల వ్యర్థాలు, రసాయనాలు, కలుషిత నీరు బీచ్‌లో విడుదల చేయడం వల్ల సముద్రం నీరు కాలుష్యంతో నురగలు కక్కుతుందని స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. అయితే సముద్రంలో కాలుష్యం పెరిగినప్పుడు ఇలాంటి మార్పులు సంభవిస్తాయని వాతావరణ నిపుణులు అంటున్నారు.



మంగమారిపేట తీరం వద్ద భారీగా నురగ

# నకిలీ పత్రాలు తయారు చేసే ముఠా అరెస్ట్

**అల్లిపురం:** నకిలీ ధృవపత్రాలు తయారు చేసే ముఠాను మహారాణిపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 90 నకిలీ ఆధార్ కార్డులు, 12 నకిలీ ఓటర్ ఐడీ కార్డులు, 10 నకిలీ హెల్త్ కార్డులు, 32 నకిలీ రబ్బర్ స్టాంపులు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాధరావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాణిపేట పరిధి తాడివీధిలో ఒక ముఠా నకిలీ ఆధార్ కార్డులు, బెయిల్‌కు అవసరమయ్యే పత్రాలు తయారు చేసి.. కోర్టులో ముద్దాయిలకు బెయిల్ కోసం షూరిటీలు పెడుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. తాడివీధికి చెందిన గరుగుబిల్లి లక్ష్మి, అక్కయ్యపాలేనికి చెందిన వి.శ్రీరామమూర్తి, తాడివీధికి చెందిన బుడుమూరి వీర కుమార్ అలియాస్ వీర రాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు విజయవాడకు చెందిన గుర్రాల కోటేశ్వరరావును పరారీలో ఉన్నాడు.

# 1న ఏయూలో మినీ జాబ్ మేళా

**సీతంపేట:** అనుసంధాన్ యువ కార్యక్రమంలో భాగంగా జూలై 1న ఏయూ కెమిస్ట్రీ విభాగంలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆరుష్ గ్రూప్ సీఈవో సుభాష్ తెలిపారు. శాంతిపురంలోని సంస్థ కార్యాలయం శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఐటీ, ఐటీఈఎస్, ఫార్మా, అగ్రిటెక్ రంగాల్లో సుమారు 1200 మంది యువత, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి 40కిపైగా కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ, ఏపీఈఐటీఏ, నెడ్‌క్యాప్ సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంబీఏ, డిప్లొమా, డిఫార్మా, బి ఫార్మా, ఎం ఫార్మా, బీకామ్, బీబీఏ, బీబీఎం విద్యార్హత ఉన్నవారు అర్హులన్నారు. ఫ్రెషర్స్ కూడా పాల్గొన వచ్చన్నారు. ఈ నెల 28లోగా 9963383744 నంబరుకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఎస్ జాయింట్ డైరెక్టర్ లావణ్య, ఏయూ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ వీఆర్ రెడ్డి, ఓఆర్‌ఎస్ రావు, గోవింద్ రాకేష్ పాల్గొన్నారు.

# బ్రాండెడ్ దుస్తుల అమ్మకాలు పొడిగింపు



సందర్శకులతో కిటకిటలాడుతున్న అమ్మకాలు

**బీచ్‌రోడ్డు:** నాణ్యత కలిగిన ప్రముఖ బ్రాండెడ్ దుస్తులు అమ్మకాల ప్రదర్శన ఈ నెల 26వ తేదీ వరకు పొడించినట్లు నిర్వహకులు తెలిపారు. బీచ్‌రోడ్డులోని పామ్‌బీచ్ హోటల్‌లో ఈ నెల 17వ తేదీ నుంచి జరుగుతున్న ఈ ప్రదర్శనకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ అమ్మకాలలో రేమండ్స్, పార్క్ అవెన్యూ, యారో, ఫ్లయింగ్‌మెషిన్, రీబాక్, జాస్ మిల్లర్ వంటి బ్రాండెడ్ దుస్తులు లేడిస్ అండ్ జెంట్స్, పిల్లలకు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు గౌరీ తెలిపారు. బ్రాండెడ్ దుస్తుల ధరలపై 80 శాతం వరకు తగ్గింపు లభిస్తుందన్నారు. రూ.1,200 నుంచి రూ.6,000 విలువ చేసే దుస్తులు రూ.500 నుంచి రూ.1000లకే లభిస్తాయన్నారు. సోమవారం వరకు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ అమ్మకాలు ఉంటాయని తెలిపారు.

# గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

**సింహాచలం:** గంజాయి కేసులో ముగ్గురిని పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 57 కిలోల గంజాయి, సెల్‌ఫోన్, లారీని స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండి అంబిక అల్లూరి జిల్లా జి.కె.వీధిలో ఉంటోంది. ఆమె కుమార్తె కిముదు సుప్రియ, అల్లుడు నవీన్ పెందుర్తి మండలం పులగానిపాలెంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. అల్లూరి జిల్లా నుంచి అంబిక గంజాయి తీసుకొచ్చి పులగానిపాలెంలో ఉంటున్న కూతురు, అల్లుడుకి ఇస్తూ ఉంటుంది. ఆ గంజాయిని అంబిక, నవీన్‌లు లారీ డ్రైవర్ వినోద్ గోస్వామితో రాజస్థాన్‌కు తరలిస్తున్నారు. వినోద్‌గోస్వామి పెందుర్తి వచ్చినప్పుడల్లా గంజాయిని అతనికి ఇస్తూ ఉంటారు. ఇలా కొంతకాలంగా జరుగుతోంది. గత శుక్రవారం విశ్వసనీయ సమాచారం పెందుర్తి ఎస్ఐ ఆసిరి తాత ఆధ్వర్యంలో పోలీసులు అక్కిరెడ్డిపాలెం వద్ద లారీని ఆపారు. లారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోగా డ్రైవర్ వినోద్ గోస్వామిని అదుపులోకి తీసుకుని విచారించారు. వినోద్ గోస్వామి ఇచ్చిన సమాచారం మేరకు అంబిక, సుప్రియని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిని రిమాండ్‌కి తరలించారు.

# జేసీఐ కార్యవర్గ ప్రమాణస్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులు, అతిథులు

**బీచ్‌రోడ్డు :** సిరిపురం దరి వాల్తేరు క్లబ్‌లో శనివారం జేసీఐ వైజాగ్ స్మార్ట్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా శ్రీధర్ కాకర్ల, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో తమ సంస్థ తరపున సేవా కార్యక్రమాలు విస్తృతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. విశాఖలో జేసీఐ నుంచి ఇది కొత్త చాప్టర్ అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, జీఎస్ఎన్ వర్మ తదితరులు హాజరయ్యారు.



**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.